క్లుప్తంగా

లక్ష్మీనృసింహస్వామి పూజ, యాగానికి ఎమ్మెల్యే..



దుగ్గొండి : మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్, వాస్తు సిద్ధాంతి పాండవుల రమేశ్ నివాసంలో ఆదివారం నిర్వహించిన శ్రీలక్ష్మీనృసింహస్వామి యాగం, పూజ కార్యక్రమాల్లో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సతీమణి సునంద సమేతంగా పాల్గొని పూజ చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వాదం తీసుకుని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమం కాంగ్రెస్ నాయకులు పెంచాల సతీశ్, నల్లబెల్లి సుదర్శన్, కొలగాని రవి, జన్ను రవి, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నర్సంపేట : స్థానిక వ్యవసాయ మార్కెట్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహించిన సలీమ్, ఉసిల్ల రజిత వరంగల్‌కు బదిలీ కాగా వారిని కార్యాలయంలో అడ్తి అసోసియేషన్ నాయకులు ఆదివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే ఇక్కడకు బదిలీపై వచ్చిన సూపర్‌వైజర్‌గా శివ, రమణ కన్నయ్య శ్రీనివాసరావులకు స్వాగతం పలికారు.

విరాళం



చెన్నారావుపేట : మండలంలోని కోనాపురం లోని గుట్టపై చేపట్టిన శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ నిర్మాణం కోసం గ్రామానికి చెందిన అంజలి గ్రామైక్య సంఘం సభ్యులు ఆదివారం రూ.లక్షా 116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అర్చకుడు శివకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు మండల అనిల్, మల్లేషం మాట్లాడారు. అంజలి గ్రామైక్య సంఘం సభ్యులను అభినందించారు. ఆలయ నిర్మాణానికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు ఎర్ర మమత, కార్యదర్శి దొంగల లక్ష్మీ, ఉపాధ్యక్షురాలు రాజమ్మ, కోశాధికారి అనిత, సహాయ కార్యదర్శి సుమలత, సీఏ మండల రమేశ్, సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మండల కార్యదర్శి ఎడ్ల రమేశ్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి అతడి టెన్త్ నాటి మిత్రులు ఆదివారం రూ.21 వేల 700 సాయం అందజేశారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో రమేశ్ మిత్రులు చింతకాయల లక్ష్మీనారాయణ, పడిదం శోభన్‌బాబు, మండల మల్లయ్య, కుసుమ శ్రీనివాస్, హంస సాంబయ్య, రాజన్న, కన్నం భాస్కర్, ఈశ్వర్, నాంపెల్లి శ్రీనివాస్, ఒంటరి రాములు, నాంపెల్లి సంపత్, ఆనందం, స్వామి, లక్ష్మణమూర్తి, బాబు, సురేందర్, అశోక్, రమేశ్ పాల్గొన్నారు.

అక్కల్‌చెడ గ్రామస్తుల..

రమేశ్ కుటుంబానికి అక్కల్‌చెడ శివారు హర్య నాయక్ తండావాసులు రూ.8 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో తండాకు చెందిన బాదావత్ పెద్ద వీరన్న, లావుడ్య వెంకన్న, పులిశేరు రాజేందర్, బాదావత్ కృష్ణ,వీరూ, దేవ్‌సింగ్, కిషోర్, సంతోశ్, రవి, బీమా తదితరులున్నారు.

'ఎస్ఆర్ఆర్' చేయూత



రాయపర్తి : మండలంలోని కాట్రపల్లికి చెందిన వెంకటమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఎస్ఆర్ఆర్ సంస్థల అధినేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం చేయూత అందించారు. ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్, సుధాకర్‌లతో శ్రీనివాస్‌రెడ్డి 75 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు పంపించారు. తొలుత బాధిత కుటుంబాన్ని శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో కిరణ్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లో తాచుపాము హల్‌చల్

తొర్రూరు: డివిజన్ కేంద్రంలోని అరుణోదయ కాలనీలోని ఓ వ్యక్తి పల్సర్ బైక్‌లో పంచుకున్న తాచుపాము ఆదివారం మధ్యాహ్నం హల్‌చల్ చేసింది. స్థానికుల కథనం ప్రకారం దొమ్మటి అశోక్‌కు చెందిన పల్సర్ బైక్‌ను తన ఇంటి ఎదుట పార్కింగ్ చేసి ఉంది. బైక్‌ను తీసుకెళ్లే సమయంలో సీటు కింద పాము కనిపించింది. సీటును తొలగించడంతో అందులోంచి పాము పారిపోయింది.

ఊరూరా గురుపౌర్ణమి వేడుకలు



దుగ్గొండి : నాచినపల్లి సాయిబాబా ఆలయంలో పూజ చేస్తున్న భక్తులు



నల్లబెల్లి : సాయిబాబా ఆలయంలో..

వర్ధన్నపేట : మండలంలో ఊరూరా గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం నిర్వహించారు. మండలంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో సాయిబాబాకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు తరలిరాగా కాకడ హారతి, హోమం, అభిషేకం, తదితర పూజలు చేశారు. బీజేపీ అనుబంధ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇల్లందలో అనుమాస కొమురయ్య స్మారక సమితి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త మోడెం కుమారస్వామి మాట్లాడారు. గురువులను గౌరవించుకోవడం సామాజిక బాధ్యతగా అభివర్ణించారు. కార్యక్రమాల్లో నాయకులు తుమ్మల యాకయ్య, తుమ్మల శ్రీధర్, అఫ్సర్, మాజీ సర్పంచ్ కుమారస్వామి, అనుమాస ప్రేమ్ ప్రసాద్, నకిరెకంటి రవీందర్, ఆబర్ల సాయిలు, శ్రీనివాస్, గణేష్, శివ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని మైలారంలోని సాయిబాబా ఆలయంలో కాకడ హారతి, సుప్రభాత, అభిషేకం, సత్యవ్రతములు, మధ్యాహ్న హారతి కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో సాయిబాబా విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో లక్ష్మి, వేణుకుమార్, ఉప్పుగల్ల శ్రీనివాస్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మినేని బుచ్చిరెడ్డి, రంగు కుమార్ గౌడ్, సంధి వంశీధర్‌రెడ్డి, పరుపాటి రవీందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సంధి బుచ్చిరెడ్డి, ఉప్పుగల్ల కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ : మండలంలోని కోటగండి వద్ద ఉన్న కొండగిరి సాయినాథుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షం కురుస్తున్నా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజ చేశారు.



రాయపర్తి : మైలారంలోని ఆలయంలో..



నల్లబెల్లి : అన్నదానం చేస్తున్న భక్తులు



వర్ధన్నపేట : ఇల్లందలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కుమారస్వామి, తదితరులు

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలోని సాయిబాబా ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భజన మండలి ఆధ్వర్యంలో సాయి సంకీర్తన నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు ఎదుగురి రమేష్‌మూర్తి, నాగేందర్‌స్వామి, భక్తులు, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ధర్మకర్త, అర్చకులు కొత్తపల్లి జీవన్ ప్రత్యేక పూజలు చేయగా భక్తులు ఆలయానికి వేకువజాము నుంచే తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మల్లాడి జయపాల్‌రెడ్డి, పదాల మురళి, మార్తా మార్కండేయ, గుగ్గిళ్ల శ్రీనివాస్, కారుకూరి ప్రసాద్, ఉప్పునూతుల ప్రభాకర్, శివనాత్రి శ్రీనివాస్, పాండవుల శంకర్‌లింగం, నాగెల్లి శ్రీధర్ పాల్గొన్నారు.

ఆశ వర్కర్లపై వేధింపులు తగదు



సమావేశంలో మాట్లాడుతున్న యువరాజు

నర్సంపేట : ఆశ వర్కర్లపై అధికారుల వేధింపులు మానుకోవాలని ఆశ వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని గ్రీన్ రిసార్ట్ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా నాయకురాలు కల్వల లలిత అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి సంతోష, యువరాజు అతిథులుగా హాజరై మాట్లాడారు. సబ్ సెంటర్ డ్యూటీల్లో జాబ్ చార్ట్‌లో లేకున్నా చేయిస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశవర్కర్లను నియమించకపోతుండడంతో భారం పడుతోందని చెప్పారు. విధి నిర్వహణలో మృతి చెందిన ఆశవర్కర్ల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రభుత్వమే రిజిస్టర్లను ప్రింట్ చేయించి అందజేయాలని, పెండింగ్‌లో ఉన్న నేషనల్ ప్రోగ్రామ్ అలవెన్స్ రిలీజ్ చేయాలని, ఏఎన్‌సీ టార్గెట్లు తొలగించాలని, ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు ఎన్నికల హామీలో భాగంగా రూ.18 వేల చొప్పున వేతనం చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మంజుల, రాష్ట్ర నాయకులు భవాని, అనిత, జిల్లా నాయకులు నాగమణి, సంధ్య, మహేశ్వరి, రమ, మధులత, మాధవి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నాటు వేసి నిరసన



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

రాయపర్తి : మండలంలోని జయరాంతండా(ఎస్)లోని ప్రధాన రహదారిలో బురదమయంగా మారగా గ్రామస్తులు రోడ్డుపై ఆదివారం నాటు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యూ) జిల్లా కమిటీ సభ్యుడు గుగులోతు అరుణ్‌నాయక్ మాట్లాడారు. తండా పరిధిలోని సూక్య తండా నుంచి జయరాంతండా(ఎస్) వరకు ఉన్న ప్రధాన రహదారిని ప్రారంభించినా పూర్తి చేయకుండా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని తెలిపారు. ఈ క్రమంలోనే వర్షానికి రహదారి బురదమయంగా మారిందని చెప్పారు. ఇకనైనా ఎమ్మెల్యే స్పందించి రహదారికి మరమ్మతు పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బాదావత్ బోజ్యానాయక్, అమ్రూనాయక్, బాదావత్ రమేశ్, బాదావత్ శ్రీను, సుమన్, సురేశ్, రమేశ్, సోమ్లా, బాదావత్ లచ్చ, గణేశ్, బుజ్జి, బాదావత్ జబ్లీ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

సంగెం : వరంగల్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావును అతడి తండ్రి సుబ్బారావు ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో మండలంలోని గుంటూరుపల్లిలో హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుమారస్వామి, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు దేవేందర్‌రెడ్డి, వెంకన్న, యాకూబ్, సుబ్బారావు, ముకుందం, రాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.

జనావాసాల్లో నీరు నిల్వకుండా చర్యలు

● తాత్కాలికంగా తొలగిన సమస్య



చెన్నారావుపేట: పనులు చేయిస్తున్న అధికారులు

చెన్నారావుపేట : మండలలలోని ఉప్పరపల్లిలో జనావాసాల్లో వర్షపు నీరు నిల్వకుండా అధికారులు చర్యలు చేపట్టారు. గ్రామంలో డ్రైనేజీలు లేకపోవడంతో వర్షపు నీరు జనావాసాల్లో నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతుండగా పత్రికలు సమస్యలు ఆదివారం వెలుగులోకి తీసుకురాగా అధికారులు, కాంట్రాక్టర్ వెంటనే స్పందించారు. నీరు చెరువులోకి వెళ్లేలా జేసీబీతో తాత్కాలికంగా పనులు చేపట్టారు. ఈ సందర్భంగా సమస్యను పత్రికలు అధికారుల దృష్టికి తీసుకెళ్లడం పట్ల కలాం ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాషుమియా, పరికి మధూకర్ హర్షం వ్యక్తం చేశారు. సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతకింది అశోక్, ఫౌండేషన్ సభ్యులు పోగుల అశోక్, రాజు, సమ్మెట కృష్ణ, కుక్కల సతీశ్, రాజు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో వానరం మృతి

● అంత్యక్రియలు నిర్వహించిన గ్రామస్తులు



పాడె మీద కళేబరాన్ని తీసుకెళ్తున్న గ్రామస్తులు

సంగెం : కుక్కల దాడిలో కోతి మృతి చెందిన ఘటన మండలంలోని గాంధీనగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. వర్షానికి సేదతీరుతున్న కోతిపై కుక్కలు ఇష్టారీతిన దాడి చేయగా అది మృత్యువాత పడింది. దీంతో గ్రామానికి చెందిన చెలుకలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో పొన్నర్సు నగేశ్, సూత్రపు సారంగపాణి, సాంబయ్య, కేశబోయిన సామ్రాజ్, ననుమాస శ్రీనివాస్, చెల్కలపల్లి పున్నం రాజు, అనిల్ తదితరులు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వానరానికి పాడెకట్టి, గొయ్యి తీసి అంత్యక్రియలు నిర్వహించారు.

వేడుకగా శాకంబరీ ఉత్సవాలు

ఖిలా వరంగల్: ఆషాఢ మాసం, గురుపౌర్ణమిని పురస్కరించుకుని వరంగల్ శివనగర్‌లోని సీతారామచంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో లలితాదేవి అమ్మవారి సంపూర్ణ శాకంబరీ ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెంకటేశ్వరచార్యులు, ఆలయాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ కుమారస్వామి, ఆలయ కమిటీ బాధ్యులు మల్ల య్య, మంచాల కృష్ణమూర్తి, రావికంటి అశోక్, చింతం యాదగిరి, శ్రీరాంరాజేష్, రావికంట అశోక్, నవీన్, ఆడెపు శ్యామ్, ఓరగంటి విమల, మంచాల రాణి పాల్గొన్నారు.

పుష్పాలంకరణంలో లక్ష్మీనృసింహ స్వామి

రామన్నపేట: ఆషాఢ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని భద్రకాళి రోడ్డులోని సింహాద్రి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఉదయం నవకలశ స్తపన, పంచామృతాభిషేకం, పండ్ల రసాలు, డ్రైఫ్రూట్స్‌తో పాటు స్వామి వారికి 108 కలశాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు తాటికొండ రాము, వేణుగోపాల్, గోపికృష్ణ, గందె నవీన్‌కుమార్, బుద్ద జగదీశ్వర్, తోట నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో..

కాశిబుగ్గ: కాశిబుగ్గ ఓసిటీ రోడ్డులోని సీతారామాంజనేయ సహిత హరిహరపుత్ర అయ్యప్ప, ఓంకారేశ్వర, సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో గురుపౌర్ణమి, శాకంబరీ పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలోని లలితాత్రిపుర సుందరి, ఆంజనేయ స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, అయ్యప్ప స్వామిని కూరగాయలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పూజా కార్యక్రమంలో అర్చకులు శ్రీకాంతాచారి, మధు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రసాద్

నయీంనగర్: శరీర, అవయవ దానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, కార్డియాలజిస్ట్ దాసరి ప్రసాద్ రావు సూచించారు. గోపాల్‌పూర్ జంక్షన్ ఆదర్శ కాలనీలో సామాజికవేత్త పరికిపండ్ల వేణు స్వగృహంలో తెలంగాణ రాష్ట్ర నేత్ర, శరీర, అవయవ దాతల ఐక్యవేదిక సమావేశాన్ని కోఆర్డినేటర్ కోన్ రెడ్డి మల్లారెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ మరణాంతరం ప్రతిఒక్కరూ తమ నేత్రాలు, శరీర, అవయవాలు దానం చేయడానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ నేత్ర, శరీర, అవయవ దాతల సంఘం రాష్ట్ర కన్వీనర్ గంజి ఈశ్వర్, కోకన్వీనర్ చల్లా రాంచందర్, ఉమ్మడి వరంగల్ జిల్లా బాధ్యులు కరేటి శంకర్‌రావు, శ్రవణ్‌కుమార్, కామిడి సతీష్‌రెడ్డి, రాజు, యుగేందర్, ఐ బ్యాంక్ ప్రతినిధులు వెంకటేశ్వర్‌రావు, రాధాకృష్ణ, విజయ, మహేందర్‌రెడ్డి, నవీన్‌కుమార్, భిక్షపతి, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షం.. అపార నష్టం



నల్లబెల్లి : మూడుచెక్కలపల్లిలో కూలిన ఇల్లు



పర్వతగిరి : రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు



దుగ్గొండి : గోపాలపురంలో నిలిచిన వర్షపు నీరు

నర్సంపేట : రెండ్రోజులుగా పట్టణంలో వర్షం కురుస్తుండగా అపార నష్టం వాటిల్లుతోన్న దుస్థితి నెలకొంది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వర్షపు నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజలు, వ్యాపారస్తులు, విద్యార్థులు, రైతులు ఇళ్ల నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేకుండాపోయింది.

నల్లబెల్లి : మండలంలో వర్షపాతం 77 మిల్లీమీటర్లుగా నమోదైంది. చిన్నపాటి జల్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు కురుస్తుండడంతో జనజీవనం స్తంభించింది. నల్లబెల్లి, మూడుచెక్కపల్లి, రుద్రగూడెం, నాక్కపేట, మేడపల్లి తదితర గ్రామాల్లో వరద నీరు ఇళ్లలోకి చేరగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడుచెక్కలపల్లిలో బానోత్ హరిసింగ్‌కు చెందిన ఇంటి గోడలు కూలిపోయాయి.

కుంగిన రోడ్డు

పర్వతగిరి : రెండ్రోజులుగా కురుస్తున్న వర్షానికి మండలంలోని చింతనెక్కొండ పెద్ద చెరువు తూము వద్ద రోడ్డు కొంత భాగం ఆదివారం కుంగిపోయింది. సమాచారం తెలిసి తహసీల్దార్ వెంకటస్వామి, ఐబీ డీఈ రాజు, ఏఈ ప్రశాంత్, ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ సెక్రెటరీ సరిత ముందస్తు చర్యలు చేపట్టారు. కట్ట తెగకుండా పైపులు, మట్టి, ఇసుక బస్తాలు వేసే దిశగా ఏర్పాట్లు చేశారు. రెండ్రోజుల్లో మరమ్మతులు పూర్తి చేయాలని తహసీల్దార్ వెంకటస్వామి ఐబీ అధికారులకు ఆదేశించారు.

ఇళ్లలోకి చేరిన వరదనీరు

దుగ్గొండి : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మండలంలోని పలు వీధులు, అంతర్గత రహదారులు బురదమయంగా మారాయి. గోపాలపురంలోని బంగ్లావీధి జలమయం కాగా ఇళ్లలోకి వరద నీరు చేరుతోంది. వరద నీరు బయటికి వెళ్లే మార్గం లేకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. మండల పరిషత్, తహసీల్దార్, మండల సమాఖ్య, వ్యవసాయ శాఖ కార్యాలయాలకు వెళ్లే దారి బురదమయంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే వివిధ ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



వర్ధన్నపేట : వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ కోరారు. ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. తడిసిన విద్యుత్ స్థంభాలను, విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్లను తాకవద్దని సూచించారు. చెట్ల కొమ్మలకు విద్యుత్ లైన్లు తగిలితే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని చెప్పారు. తరగతి గదుల్లో స్విచ్ బోర్డులను తడి చేతులతో ముట్టుకోవద్దని, బయట ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు తడవకుండా చూసుకోవాలని, ఉతికిన బట్టలను ఇనుప తీగలపై ఆరవేయొద్దని, తెగిన విద్యుత్ తీగలను తాకవద్దని, విద్యుత్ స్థంభం కింద నిల్చుని సెల్ ఫోన్ మాట్లడవద్దని తెలిపారు. ఇంట్లోకి వచ్చే సర్వీస్ వైర్లు బయటకు వస్తే విద్యుత్ సిబ్బంది, రోడ్లపై చెట్లు కూలిపోయినపుడు పోలీస్ శాఖకు సమాచారం అందించాలని చెప్పారు. ఆపద సమయాల్లో డయల్ 100కు ఫోన్ చేసి సేవలు వినియోగించుకోవాలని కోరారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



కాజీపేట ప్రధాన రహదారిపైకి చేరిన వరద నీరు



మామునూరులో జాతీయ రహదారిపై..



మడికొండ: వినాయకనగర్ కాలనీలో..

కాజీపేట: మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు కాజీపేట పట్టణంలోని పలు లోతట్టుప్రాంతాలు జలమయం అయ్యాయి. జూబ్లీమార్కెట్, ప్రశాంత్‌నగర్, బాపూజీనగర్, ప్రగతినగర్, చైతన్యపురి తదితర కాలనీల్లోకి వర్షపు నీరు చేరుతోంది. కాలువలు పొంగిపొర్లుతున్నాయి. ప్రధాన రహదారులన్నీ జలంతో నిండిపోయాయి.

జాతీయ రహదారిపై వరద ప్రవాహం

మామునూరు: వర్షాలకు వరంగల్ 43వ డివిజన్ మామునూరులోని ఖమ్మం జాతీయ రహదారిపై వరదనీరు ప్రవహిస్తోంది. దాంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈక్రమంలో రహదారిని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆదివారం పరిశీలించారు. డ్రెయినేజీ నిర్మాణంతోపాటు రోడ్డును ఎత్తు పెంచేందుకు నిధులు కేటాయిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

మడికొండలో..

మడికొండ: 64వ డివిజన్ మడికొండ–ధర్మసాగర్ రోడ్డు వినాయకనగర్ కాలనీలో సైడ్ డ్రెయినేజీ, సీసీ రోడ్లు నిర్మించకపోవడంతో చిన్నపాటి వర్షానికే అంతర్గత రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. దోమలు వృద్ధిచెంది రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.

కనుల పండువగా బోనాలు



పెద్దవంగర: మండలంలోని ఉప్పరగూడెం గ్రామంలో బోనాల పండగను ఆదివారం గ్రామ ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామ శివారులో ఉన్న ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢ మాంసం కావడంతో గ్రామ దేవతకు గ్రామస్తులంతా ఇంటికి ఒక్క బోనం చొప్పున మహిళలు డప్పు చప్పుల నడుమ ఊరేగింపుగా దేవతలకు వద్దకు తీసుకెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఎలాంటి వ్యాధులు సోకకుండా చూడాలని తల్లిని వేడుకున్నారు. వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండాలని మొక్కుకున్నట్లు మహిళలు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జమున సమ్మయ్య, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ రూరల్ :
✆ 9951602875 ✆ 9553955722
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
డి. రాజు యాదవ్ (S.R) : 9502950309 (వర్ధన్నపేట)
ఎం. మురారి (S.R) : 9502950309 (నర్సంపేట)
పి.చంద్రశేఖర్ (A.C.O) : 9963646944